AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAYNEWS.COM
20-8-2026 (Thursday) MAIN EDITION

## పాక్ చర్యకు భారత్ కౌంటర్..



**అక్షరటుడే, న్యూఢిల్లీ :** పాకిస్థాన్ చర్యలకు భారత్ కౌంటర్ ఇచ్చింది. ఢిల్లీలోని పాక్ హైకమిషన్ వెలుపల ఉన్న బాహ్య భద్రతా వలయాన్ని అధికారులు కూల్చివేశారు. గతంలో దౌత్య ప్రాంగణానికి రక్షణగా ఉన్న ట్రాఫిక్ బోలార్డులు, బారికేడ్లను తొలగించారు. ఇస్లామాబాద్‌లోని భారత హైకమిషన్ వెలుపల ఉన్న రక్షణ భద్రతా బారికేడ్లను పాక్ అధికారులు తొలగించినట్లు వార్తలు వచ్చిన సరిగ్గా మూడు రోజుల తర్వాత ఈ చర్య జరిగింది.

## రాజీవ్‌గాంధీ సేవలను కొనియాడిన పొన్నం



**అక్షరటుడే, కరీంనగర్:** దేశాన్ని ఆధునిక సాంకేతిక యుగంలోకి తీసుకెళ్లిన దార్శనికుడు, మాజీ ప్రధాని, భారతరత్న రాజీవ్‌గాంధీ అని మంత్రి పొన్నం ప్రభాకర్ కొనియాడారు. ముల్కనూరు అంబేద్కర్ చౌక్ వద్ద రాజీవ్‌గాంధీ జయంతి ఘనంగా నిర్వహించారు. రాజీవ్‌గాంధీ 18 ఏళ్లకే ఓటుహక్కు కల్పించి, ప్రజాస్వామ్యంలో యువత భాగస్వామ్యాన్ని పెంచారన్నారు.

### సీనియర్ నటి షావుకారు జానకికి అస్వస్థత



అక్షరటుడే, సినిమా డెస్క్: సీనియర్ నటి షావుకారు జానకి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. శ్వాసకోశ సమస్యలతో వారం రోజుల క్రితం ఆమె ఆస్పత్రిలో చేరారు. ఆరోగ్యం క్షీణించడంతో బుధవారం రాత్రి రాత్రి ఐసీయూకి తరలించారు. ప్రస్తుతం ఆమెకు వెంటిలేటర్ సాయంతో చికిత్స అందిస్తున్నారు.

### రాష్ట్రంలో పెరగనున్న ఉష్ణోగ్రతలు



అక్షరటుడే, హైదరాబాద్ : రాష్ట్రంలో రానున్న రెండు రోజుల పాటు వర్షా లు తగ్గుముఖం పడుతాయని వాతావరణ నిపుణుడు బాలాజీ తెలిపారు. ఉష్ణోగ్రతలు పెరుగుతాయని పేర్కొన్నారు. అలాగే పలు ప్రాంతాల్లో గురువారం తేలికపాటి నుంచి మోస్తరు జల్లులు కురిసే అవకాశం ఉంది. పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు,

### మారిన మిలాద్-ఉన్-నబి సెలవు తేదీ



అక్షరటుడే, ఏపీ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మిలాద్-ఉన్-నబి పండుగ సాధారణ సెలవు తేదీని సవరిస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. అకడమిక్ క్యాలెండర్, మునుపటి ఉత్తర్వుల ప్రకారం ఆగస్టు 25న ఇవ్వాల్సిన పబ్లిక్ హాలిడేను, తాజాగా ఆగస్టు 26వ తేదీకి మారుస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

**పార్టీ లైన్ దాటితే క్రమ శిక్షణ చర్యలు తప్పవని పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. కొండా సుస్మిత వ్యాఖ్యలు బాధాకరమని.. తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. సుస్మిత వ్యాఖ్యలపై మంత్రి కొండా సురేఖకు షోకాజ్ నోటీసులు ఇచ్చామని పేర్కొన్నారు. చిన్నారెడ్డి వ్యాఖ్యలపై సైతం వివరణ కోరామన్నారు. నిజామాబాద్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు.**

– అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి



# పార్టీ లైన్ దాటితే చర్యలు

■ అధిష్ఠానం నిర్ణయించిన వారికే టికెట్ ■ 22ఏ భూములపై చర్యలు తీసుకుంటాం ■ పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్

కొండా సురేఖ కుమార్తె సుష్మితల ఇటీవల వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రి పొంగులేటిపై ఆమె ఆరోపణలు చేశారు. సుష్మిత వ్యాఖ్యల నేపథ్యంలో ఆమె తల్లి కొండా సురేఖకు పీసీసీ క్రమశిక్షణ కమిటీ ఇప్పటికే నోటీసులు ఇచ్చింది. ఈ విషయమై నిజామాబాద్‌లో పీసీసీ చీఫ్ స్పందించారు. సురేఖ మంత్రి పదవిలో ఉన్నారు కాబట్టి వివరణ కోరామని చెప్పారు. చిన్నారెడ్డి చాలా సీనియర్ నాయకులు అని.. ఆయన అలా ఎందుకు మాట్లాడాల్సి వచ్చిందనే దానిపై కూడా వివరణ అడిగామని తెలిపారు. పార్టీ లైన్ దాటితే క్రమ శిక్షణ చర్యలు తప్పవని స్పష్టం చేశారు. క్రమశిక్షణ కమిటీకి వివరణ ఇచ్చాక ఏం చేయాలో ఆలోచిస్తామని తెలిపారు.

### అభ్యర్థిని అధిష్ఠానం ప్రకటిస్తుంది

వచ్చే ఎన్నికల్లో పరకాల కాంగ్రెస్ అభ్యర్థి రేవూరి ప్రకాశ్ రెడ్డి అని సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. మరోవైపు తాను పోటీ చేస్తానని కొండా సుష్మిత అన్నారు. ఈ వ్యాఖ్యలపై పీసీసీ చీఫ్ స్పందిస్తూ.. ఎమ్మెల్యేల అభ్యర్థులను నిర్ణయించేది కాంగ్రెస్ అధిష్ఠానం అని స్పష్టం చేశారు. ఎవరు చెప్పినా అది చెల్లదన్నారు. పచ్చ కాంగ్రెస్ వ్యాఖ్యలపై మాట్లాడుతూ.. ఒక్కసారి కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం తీసుకున్నాక పచ్చ, ఎరుపు, నలుపు అనే తేడా ఉండదని అన్నారు. అందరం కాంగ్రెస్ పార్టీ నాయకులమేనని స్పష్టం చేశారు..

### 22ఏ విషయంలో తప్పులు జరిగాయి

రాష్ట్రంలో పలు భూములను 22ఏ కింద నిషేధిత జాబితాలో పెట్టిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంలో కింది స్థాయిలో కొన్ని తప్పిదాలు జరిగాయని పీసీసీ చీఫ్ అంగీకరించారు. 22A అంశం పై హరీశ్ రావు రాహుల్ గాంధీకి లేఖ రాసి కావాలనే అనవసర రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. కింది స్థాయిలో జరిగిన తప్పిదాలను గుర్తించి, వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామని స్పష్టం చేశారు. 22 ఏ వల్ల భూ దందా, భూముల అన్యాక్రాంతానికి అవకాశం ఉండదన్నారు. తమ ప్రభుత్వం లో సామాన్యులకు అన్యాయం జరిగితే గాంధీ భవన్ తలుపులు తట్టవచ్చని తెలిపారు.

### పోచారంతో మాట్లాడా

బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలపై ఆయనతో మాట్లాడినట్లు మహేశ్‌గౌడ్ తెలిపారు. ఆయన ఆవేదనను అర్థం చేసుకున్నట్లు చెప్పారు. బాన్సువాడలో పాత కొత్త నేతల కలయికతో ముందుకు వెళ్తామని పేర్కొన్నారు. పోచారం కాంగ్రెస్ సిద్ధాంతాలకు, సంక్షేమానికి మద్దతుగా ఉన్నారని తెలిపారు. నామినేటెడ్ పదవుల్లో కాంగ్రెస్ సీనియర్ నేతలకు 70 శాతం పదవులు ఇస్తామని పీసీసీ చీఫ్ పేర్కొన్నారు.

## దేశ వ్యతిరేక నిర్ణయం తీసుకున్న కాంగ్రెస్ : అమిత్ షా



**అక్షరటుడే, తమిళనాడు :** వందేమాతరంపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీసుకున్న నిర్ణయంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందించారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఒక దేశ వ్యతిరేక నిర్ణయం తీసుకుందని ఆరోపించారు. తమిళనాడులో గురువారం ఆయన మాట్లాడారు. సీడబ్ల్యూసీ బుధవారం సమావేశమై 1937 నాటి తమ తీర్మానాన్ని అనుసరిస్తూ వందేమాతరంలో కేవలం రెండు చరణాలను మాత్రమే పాడాలని నిర్ణయించింది. 1937లో ముస్లింలను బుజ్జగించేందుకు వందేమాతరాన్ని విభజించడం ద్వారా కాంగ్రెస్ దేశ విభజనకు పునాది వేసిందని అమిత్ షా అన్నారు. తాజాగా కాంగ్రెస్ నిర్ణయం వారి బుజ్జగింపు రాజకీయ విధానాన్ని ధృవీకరిస్తోందని విమర్శించారు.

## తహశీల్దార్ ఇంట్లో ఏసీబీ సోదాలు



**అక్షరటుడే, హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలోని ఇబ్రహీంపట్నం తహశీల్దార్ నివాసాల్లో ఏసీబీ అధికారులు సోదాలు చేపట్టారు. తహశీల్దార్ శ్రీనివాస్ రెడ్డిపై అనేక అవినీతి ఆరోపణలు ఉన్నాయి. ఆయన భారీగా అక్రమాస్తులు కూడబెట్టినట్లు ఏసీబీకి ఫిర్యాదులు అఆదాయి. ఈ మేరకు కేసు నమోదు చేసిన అధికారులు గురువారం ఉదయం ఆయన నివాసం, కార్యాలయంతో పాటు 14 చోట్ల సోదాలు చేశారు. ఆయన గతంలో మహేశ్వరం తహశీల్దార్‌గా పని చేశారు.

## 4 నెలల్లో 22 మంది ఉరిశిక్ష వేసిన జడ్జి..



**అక్షరటుడే, యూపీ :** ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్‌లో ఉన్న ఫాస్ట్‌ట్రాక్ కోర్టు అదనపు జిల్లా, సెషన్స్ న్యాయమూర్తి రవి కుమార్ దివాకర్ నాలుగు నెలల్లో 22 మందికి ఉరిశిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. దీంతో ఆయన ముందు విచారణకు రావాల్సిన 100 హత్య కేసులను మరొక న్యాయమూర్తికి బదిలీ చేశారు. మరణశిక్ష, జీవిత ఖైదు విధించదగిన నేరాలకు సంబంధించిన ఈ కేసులను, అదనపు జిల్లా, సెషన్స్ న్యాయమూర్తి రవి కుమార్ దివాకర్ కోర్టు నుంచి జిల్లా, సెషన్స్ న్యాయమూర్తి వీరేంద్ర కుమార్ సింగ్ కోర్టుకు బదిలీ చేసినట్లు ప్రభుత్వ న్యాయవాది తెలిపారు. వారికి కూడా మరణశిక్ష విధించే అవకాశం ఉందనే ఆందోళన నెలకొందని జిల్లా బార్ అసోసియే

## ప్రమాదకరమైన పాలసీని అనుసరిస్తున్న మెటా

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** మెటా ఆధీనంలోని ఇన్‌స్టాగ్రామ్.. 13 ఏళ్లలోపు చిన్నారుల విషయంలో 'డోంట్ ఆస్క్.. డోంట్ టెల్' అనే ప్రమాదకరమైన పాలసీని అనుసరించిందని ఆ సంస్థ మాజీ ఇంజినీరింగ్ డైరెక్టర్ ఆర్టరో బెజర్ కోర్టులో సంచలన విషయాలు వెల్లడించారు. కొత్త టూల్స్ తయారీలో భద్రతను పట్టించుకోకుండా.. లాభాలపైనే దృష్టి పెట్టిందని తెలిపారు. ప్రజలు ఎంత అధిక సమయం తమ యాప్స్‌లో గడుపుతారు అనే అంశానికే ప్రాధాన్యమిచ్చిందని వివరించారు. ఇన్‌స్టాగ్రామ్ వాడే 13 ఏళ్ల లోపు చిన్నారుల విషయంలో 'డోంట్ ఆస్క్.. డోంట్ టెల్' పాలసీని అమలు చేశారన్నారు.



## డీఎస్సీలో భారీగా అక్రమాలు : వైఎస్ జగన్



**అక్షరటుడే, ఏపీ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంపై మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ విమర్శలు చేశారు. డీఎస్సీలో అక్రమాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని ఆరోపించారు. ప్రశ్నిస్తే గింజుకుంటున్నారు, తప్పు ఒప్పుకోవడం లేదన్నారు. చంద్రబాబు, లోకేష్ మైండ్‌లో చిప్‌లు ఉన్నాయా? లేదా అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. డీఎస్సీ రాయకుండానే స్పోర్ట్స్ కోటా ఉద్యోగాలిచ్చారని ఆరోపించారు. తమకు కావాల్సినవారికి స్పోర్ట్స్ కోటా ఉద్యోగాలు ఇచ్చుకున్నారని పేర్కొన్నారు. కూటమి నాయకులు అసెంబ్లీలో మాట్లడతారు కానీ కౌన్సిల్‌లో మాట్లాడరని జగన్ అన్నారు.



## వీడియోలు చేస్తే రూ.లక్ష క్యాష్‌ప్రైజ్

**అక్షరటుడే, బీహార్:** బీహార్ ప్రభుత్వం సోషల్ మీడియా కంటెంట్ క్రియేటర్లు, ఇన్‌ఫ్లుయెన్సర్ల కోసం ఒక సరికొత్త ఆదాయ అవకాశాన్ని అందుబాటులోకి తెచ్చింది. రాష్ట్రంలో అమలువుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి ప్రాజెక్టులు, ప్రభుత్వ విజయాలపై వీడియోలు చేసే క్రియేటర్లకు ఆర్థిక ప్రోత్సాహకం అందించేలా 'సోషల్ మీడియా అండ్ అదర్ ఆన్‌లైన్ మీడియా రూల్స్' సవరణలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఒక వీడియో పోస్ట్ చేసిన 30 రోజుల వ్యవధి పూర్తయిన తర్వాత వచ్చే ప్రతి 1 లక్ష వ్యూస్‌కు క్రియేటర్లకు అదనంగా రూ.10,000 చొప్పున చెల్లిస్తారు. ఒకే వీడియోకు ఇచ్చే గరిష్ట పరిహారం రూ.1 లక్ష వరకు ఉంటుంది.

## రూ.20 లంచం కేసు.. సుప్రీంకోర్టు సంచలన తీర్పు



**అక్షరటుడే, ఢిల్లీ :** కేవలం రూ.20 లంచం తీసుకున్నారన్న ఆరోపణలకు సంబంధించిన కేసులో ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులు దాదాపు 30 ఏళ్ల సుదీర్ఘ న్యాయపోరాటం తర్వాత ఎట్టకేలకు నిర్దోషులుగా బయటపడ్డారు. ఈ కేసులో గుజరాత్‌కు చెందిన ఇద్దరు ఉద్యోగులను దోషులుగా తేలుస్తూ ట్రయల్ కోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు పక్కన పెట్టింది. జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ అతుల్ ఎస్ చందూర్కర్‌లతో కూడిన ధర్మాసనం ఈ సంచలన తీర్పు వెలువరించింది. లంచం డిమాండ్ చేసినట్లు ఎలాంటి స్పష్టమైన రుజువులు లేవని, కేవలం రూ.20 రికవరీ అయినంత మాత్రాన వారిని దోషులుగా నిర్ధారించలేమని కోర్టు తేల్చిచెప్పింది.

## తల్లిదండ్రుల చాటున కొండా సుష్మిత రాజకీయం



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** మంత్రి కొండా సురేఖ కూతురు సుష్మిత వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో తీవ్ర చర్చకు దారి తీశాయి. ఈ వ్యాఖ్యలపై ఇప్పటికే క్రమశిక్షణ కమిటీ నోటీసులు జారీ చేసింది. గాంధీ భవన్‌లో కాంగ్రెస్ మహిళా నేత ఇందిరా శోభన్ మాట్లాడుతూ.. పార్టీ లైన్ దాటి సీఎంను విమర్శించే అధికారం ఎవరిచ్చారు అని సుష్మితను ప్రశ్నించారు. నోటికి ఏదొస్తే అది మాట్లాడి చులకన కావొద్దని హితవు పలికారు. తల్లిదండ్రుల పెంపకాన్ని ప్రశ్నించేలా మాట్లాడొద్దని, తల్లిదండ్రుల చాటున రాజకీయం చేస్తున్న ఆమెకు సీఎంను అనే హక్కు ఉందా అని ఆగ్రహం వ్యక్తం చేశారు.